క్లుప్తంగా

రెడ్డి కుటుంబ సభ్యుల వనభోజనం

బేస్తవారిపేట: స్థానిక దర్గా రోడ్డులోని పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు బేస్తవారిపేట గ్రామంలోని రెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక జరుగుతుందని యోగి వేమన రెడ్డి సంఘం నిర్వాహకులు తెలిపారు. ఉదయం డీజే పాటలతో మహిళా కోలాటం, కాశీశ్వరస్వామి శివాలయంలో అభిషేకాలు జరుగుతాయన్నారు. కార్తీక వన భోజన కార్యక్రమానికి రెడ్డి కుటుంబ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

సత్యమణికంఠేశ్వర ఆలయంలో కోటి దీపోత్సవం

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోట సత్యమణికంఠేశ్వర ఆలయంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా సామగ్రి ఆలయ కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కోట సత్యమాంబదేవి, సత్యమణికంఠేశ్వర ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

కంభం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాలనీ నుంచి బియ్యం లోడుతో వెళ్తున్న ఆటోను గోడౌన్ డీటీ ప్రసాద్ స్వాధీనం చేసుకుని 16 బస్తాల బియ్యాన్ని గోడౌన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం

మార్కాపురం: లోక్ అదాలత్‌ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని మార్కాపురం జిల్లా కోర్టుల ఆరో అదనపు న్యాయమూర్తి ఎం. శుభవాణి తెలిపారు. శనివారం మార్కాపురం కోర్టు సముదాయంలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 126 కేసులను పరిష్కరించి 42.56 లక్షల రూపాయలను కక్షిదారులకు ఇచ్చామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి బి. దేవేందర్ రెడ్డి, ఒంగోలు కోర్టు ప్రథమ శ్రేణి అదనపు న్యాయమూర్తి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు బి. కాశయ్య, ఉషశ్రీ, హరికృష్ణ, సైదులు నాయక్, అశోక్ నాయక్, కరీమున్నీసా బేగంలు బెంచ్ మెంబర్లుగా వ్యవహరించారు.

ఘనంగా కుంకుమార్చన

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారికి మహిళా భక్తులు కుంకుమార్చన పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, అనంతరం సుప్రభాత సేవ, తోమాల సేవను అర్చకులు అరుణ్‌శర్మ నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రావిపాటి రామారావు, నిట్టూరి రమేష్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం

యర్రగొండపాలెం: ఐక్యంగా కలిసి ఉండి సమస్యలు పరిష్కరించుకుందామని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య అన్నారు. శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆర్డీటీ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు మరువరానివని, ఆ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్డీటీ అందిస్తున్న ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాలు, చంకకర్రలు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, అంధుల చేతికర్రలు అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ పిల్లలను పెద్దదోర్నాలలోని దివ్యాంగుల పాఠశాలలో చేర్చి విద్యను అభ్యశించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. గిరిజనులకు నిర్మిస్తున్న గృహాలు దివ్యాంగులకు కూడా నిర్మించి ఆదుకోవాలని ఆయన ఆర్డీటీ అధికారులను కోరారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీటీ ఏరియా టీం లీడర్ గిరిజ, జులేఖ, సుధీర్, బి.చిన్నయ్య, పెద్ద పాలంకయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన బాలిరెడ్డి

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో మోటార్ సైకిల్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. బేస్తవారిపేటకు చెందిన సీపీఐ మండల కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి మోటార్ సైకిల్‌పై హైవేను దాటుతున్నాడు. కొమరోలు వైపు నుంచి బేస్తవారిపేటకు పత్తిలోడు కోసం వెళ్లే బొలెరో వాహనం రాంగ్‌రూట్‌లో వెళ్లి వేగంగా మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. మోటార్ సైకిల్ నడుపుతున్న బాలిరెడ్డి హైవేకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్‌కు తల బలంగా తగిలింది. తల పగిలి, కాలు విరిగిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

వర్షంతో పచ్చదనం


జీవం పోసుకున్న అలసంద, మినుము పంటలు



కొనకనమిట్ల: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు రైతులను కొంత ఇబ్బంది పెట్టినప్పటికీ మెట్ట పంటలకు జీవం పోశాయి. పదును వర్షం కురవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, పత్తి, ఆముదం పంటలతో పాటు ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము, అలసంద (బొబ్బర్లు), వేరుశనగ, వరి, మిర్చి, పొగాకు పంటలతో పాటు కూరగాయలు, పండ్ల తోటలకు వర్షం జీవం పోసింది. ఎక్కువగా వీచిన గాలులకు పలు గ్రామాల్లో మిర్చి పంట నేల వాలటంతో రైతులు మిర్చి పైరును లేపుకుంటున్నారు. అయితే మినుము పంట ఆశించినంత అనుకూలంగా లేదని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నెలలో రెండు సార్లు అనుకూలంగా వర్షాలు పడటం వలన పంటలు పచ్చదనం నెలకొన్నాయి. వర్షాలకు కొంత మేర చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలకు నీరు చేరటంతో జలకళను సంతరించుకొన్నాయి. పలు గ్రామాల్లో వరి, మిర్చి నాట్లు పూర్తవగా లేత సాగులో పొగాకు నాట్లు వేస్తున్నారు. రానున్న రోజుల్లో కూడా మంచి వర్షాలు పడితే ముదురు పంటలతో పాటు లేతగా సాగు చేసిన పంటలు ఆశాజనకంగా పండుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


లేత పొగాకు పంటలు


పచ్చదనంతో ఉన్న మిర్చి

సమాజానికి ఉపయోగపడే నాయకుడు అవసరం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

యర్రగొండపాలెం: ప్రస్తుత పరిస్థితుల్లో అందరికి మేలు చేస్తూ సమాజానికి ఉపయోగపడే నాయకుడి సేవలు అవసరం ఉంటుందని, అటువంటి నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పూర్వీకులు గ్రామాల్లో తమ స్వార్థాన్ని విడనాడి అందరితో కలిసి మెలిసి ఉండేవారని, అటువంటి సంస్కృతి పునరావృత్తం కావాలని, విద్య, వైద్యం కోసం సంఘీయులు చేయుత ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ఉన్న ఆధిపత్యం పోరును పక్కనపెట్టి అందరికీ సహాయ, సహకారాలు అందించి మంచిపేరు తెచ్చుకోవాలని, ముఖ్యంగా రైతులకు చేదోడుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మంచి బాటలో నడుస్తూ రాజకీయంగా ఎదిగే విధంగా సంఘంలో పేరు తెచ్చుకోవాలని సూచించారు. శ్రీశైలం రెడ్ల నిత్య అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి గొలమారి తాతిరెడ్డి, రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘ ప్రచార కార్యదర్శి ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, రెడ్డి సంక్షేమ సేవా సంఘ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు మార్తాల సుబ్బారెడ్డి, కె.ఓబులరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ లక్ష్మీరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, కె.నారాయణరెడ్డి, యర్ర లక్ష్మీరెడ్డి, ఈదుల రాజశేఖరరెడ్డి, శెనగ నారాయణరెడ్డి, ఆవుల రమణారెడ్డి, బిజ్జం రమణారెడ్డి, ఆవుల చెంచిరెడ్డి, నారు నాసర్‌రెడ్డి, కోట వెంకటరెడ్డి, భాష్యం శ్రీను, కొల్లి సత్యనారాయణరెడ్డి, పాశెం నందిరెడ్డి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో చురుగ్గా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకు సోషల్‌మీడియా సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సోషల్‌మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా దీవేన, వసతి దీవెన, విద్యా కానుకలు, ఉద్యోగాల కల్పన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, రైతు భరోసా, పరిశ్రమల స్థాపన తదితర పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించేందుకు పనిచేయాలన్నారు. రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని, ఎన్నికల వరకూ ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీల అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ రాజీరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వాసుదేవ రెడ్డి, మండల కన్వీనర్లు శివారెడ్డి, ఎల్. శేఖర్, ఇంద్ర సేనారెడ్డి, వెంకటేశ్వర్లు, ఖాశీం, మూల యల్లారెడ్డి, నాలి రజనీ, మార్కు, యల్లకర రంగయ్య, సందీప్, దాసు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత


బీమా నగదు అందిస్తున్న ఎంపీపీ

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన చిరుగూరి పిచ్చారావు ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. ఆ మేరకు పిచ్చారావు కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేల నగదును ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, సర్పంచ్ గోసుల అనురాధ వెలుగొండయ్య అందజేశారు. అంత్యక్రియల ఖర్చు నిమిత్తం పిచ్చారావు భార్య దేవమ్మకు నగదును అందించారు. బీమాకు సంబంధించిన రావాల్సిన మిగతా నగదును త్వరలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి ఏలూరి సంజీవ రెడ్డి, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారు రెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో పాల్గొనాలి


కిట్లు అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ


కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మార్కాపురం రూరల్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఎంపీపీ అరుణా చెంచి రెడ్డి, ఎంపీడీఓ చందన కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్లను అందించారు. వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో క్రీడలపై ఆసక్తి ఉన్నవారు ఆడుదాం ఆంధ్రలో పాల్గొనవచ్చన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ

అర్ధవీడు (కంభం): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఎం.వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి రాబడి, పరిపాలన విధానంపై కార్యదర్శులక వివరించారు. అనంతరం జగనన్న ఆడుదాం ఆంధ్రా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, ఎంపీడీఓ మస్తాన్ వలి, కోఆప్షన్ సభ్యుడు జిలానీ, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బహుజన ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు కృషి


సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

మార్కాపురం: బహుజన ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణే బీటీఏ లక్ష్యమని రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పి. వెంకటరావు అన్నారు. శనివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ సమావేశం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. మాదాసు రంగనాయకులు అధ్యక్షత వహించారు. వెంకటరావు మాట్లాడుతూ గత 22 ఏళ్ల నుంచి ఉపాధ్యాయులకు సేవలతోపాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు డి. శ్రీనివాసులు, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎల్. ఆంటోనీ తదితరులు మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే ఆలోచనతో నడుస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం బీటీఏ మాత్రమేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు 20 ఏళ్ల నుంచి మెరిట్ రోస్టర్ విధానాన్ని అమలు చేయడంలో బీటీఏ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్ర నాయకులు పీజే రామయ్య, చిన్న వెంగయ్య, ప్రతాప్, నల్లబోతుల శ్రీనివాసులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ సలహాదారు నల్లబోతుల శ్రీనివాసులు తెలిపారు. అధ్యక్షుడు పీసీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా రమణ, కార్యదర్శులుగా సుబ్బారావు, ఓబులేసు, ఠాగూర్ నాయక్, పిక్కిలి వెంకటేశ్వర్లు, భాను ప్రకాష్, కె. రవిచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. రంగనాయకులు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నామన్నారు.

అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం

యర్రగొండపాలెం: అటవీ ప్రాంతంలో 2024 జనవరి1వ తేదీ నుంచి ప్లాస్టిక్ వాడకం నిషేధిస్తున్నామని, ముఖ్యంగా దద్దనాల ఆంజనేయస్వామి గుడికి వెళ్లే భక్తులు ప్లాస్టిక్‌కు సంబంధించిన క్యారీ బ్యాగులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు తీసుకొని రావొద్దని స్థానిక రేంజ్ అధికారి ఏవీ నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం టైగర్ ప్రాజెక్ట్ మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖాధికారులు పుల్లలచెరువు మండలంలోని నరజాముల తండా చెక్‌పోస్ట్, కూల్ డ్రింగ్ షాపు యజమానులకు, స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. అటవీ నిబంధనలు ఉల్లఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కొలుకుల సెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, బీట్ ఆఫీసర్లు షేక్ ఖాజా, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ పుష్పలత

పెద్దదోర్నాల: విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించి వారు సంఘంలో గౌరవంగా జీవించేలా చూడాలని ఆర్‌డీటీ రీజనల్ డైరెక్టర్ పుష్పలత పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఫాదర్ ఫెర్రర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్వివ్యాంగులు ఆత్మన్యూనత భావాన్ని వీడనాడి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. దివ్యాంగులు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందని, ఆయా అవకాశాలను ద్వివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ద్వివ్యాంగులు వారు ఎన్నుకున్న రంగాల్లో మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ద్వివ్యాంగులు చేయూతనిచ్చి వారిని ఆదుకోవడంతో పాటు వారిలో ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలన్నారు. ఐడీ సెంటర్ డైరెక్టర్ జులేఖ, మేనేజర్ నరసింహులు, సుధీర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ బాష, ఏరియా టీం లీడర్ వేమయ్య పాల్గొన్నారు.

అభిజ్ఞ భారత్ ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్యసేవలు


గిరిజనులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

యర్రగొండపాలెం: ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీలో గిరిజన మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు వైద్యాధికారులు పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు ప్రొటీన్, కాల్షియం, ఐరన్ మందులు పంపిణీ చేశారు. అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి దుంప, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వి.కోటనాయక్, సయ్యద్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

యర్రబాలెంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర


యర్రబాలెంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కంభం: మండలంలోని యర్రబాలెం, నల్లకాల్వ గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానమంత్రి వీడియో సందేశాన్ని ప్రజలకు వినిపించారు. అటల్ పెన్షన్ యోజన, సుకన్య సంవృద్ధి యోజన, ముద్ర లోన్ పథకాలపై తురిమెళ్ల కెనరా బ్యాంక్ మేనేజర్ కృష్ణ వివరించారు. సాయిల్ హెల్త్ కార్డ్, పీఎం కిసాన్, డ్రోన్ వినియోగంపై వ్యవసాయాధికారులు వివరించారు. సమగ్ర శిశు సంక్షే పథకాలపై బాలింతలకు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహార వినియోగంపై ఐసీడీఎస్ సిబ్బంది వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, సర్పంచ్ మద్దు శ్రీనివాస్, డాక్టర్ అక్తర్ రసూల్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం మొలకెత్తకుండా చూసుకోవాలి


వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ

ముండ్లమూరు: తుఫాన్ కారణంగా నేలకొరిగిన పంట మొలకెత్తకుండా రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి ఫరూక్ తెలిపారు. మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. నీట మునిగిన పంట మొలకెత్త కుండా ఉండేందుకు ఎకరాకు 25 కేజీల కల్లు ఉప్పును నీళ్లలో కలిపి చల్లుకోవాలన్నారు. పొలంలో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు బయటకు వెళ్లగొట్టాలని తెలిపారు. శనగ, కంది పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట వీఏఏ, రైతులు ఉన్నారు.

ఎంపీ మాగుంట సొంత నిధులతో రోడ్డు పనులు


రోడ్డు పనులు చేస్తున్న జేసీబీ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తురకపాలెంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డిల సొంత నిధులతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వారు స్థానిక హైస్కూల్ నుంచి నాగార్జున సాగర్ కాలువ వరకు రెండు కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వెలుగొండలో కార్తీక సందడి


వెలుగొండ ఆలయంలో శ్రీవారు

కొనకనమిట్ల: కార్తీక మాసం చివరి శనివారం కావటంతో మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ అలివేలుమంగగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దొనకొండ: మండలంలోని యర్రబాలెం ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. ఈ సందర్భంగా సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస యోజన కింద సైడు కాలువలకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. సీసీ రోడ్లు ఏర్పాటు చేసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ నూనె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల వెంకట సుబ్బయ్య, ముజాయిద్, ఎంపీటీసీ తాల్లూరి లక్ష్మీ నాగేష్ పాల్గొన్నారు.

తప్పు చేసిన వారే బాధ్యులు

పుల్లలచెరువు: ఎవరు తప్పు చేస్తే వాళ్లే బాధ్యులవుతారని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు చట్టాలు ఉన్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్.రాములు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యర్రగొండపాలెంలో దళిత యువకుడిపై పోలీసుల దాడికి మంత్రి సురేష్ బాధ్యత వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమిత అధ్యక్షుడు నీలం నాగేంద్ర ప్రకటనను ఆయన ఖండించారు. సంఘటన జరిగిన వెంటనే జిల్లా అధికారులతో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడి బాధ్యులైవరైనా చర్యలు తీసుకోవాలని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

పోస్టల్ బీమాపై ప్రత్యేక డ్రైవ్

పొదిలి: పోస్టల్‌కు సంబంధించి రూ.396ల బీమా పాలసీపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డివిజనల్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ చెప్పారు. శనివారం స్థానిక పోస్టాఫీసులో బాధిత కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందించారు. విజయకుమార్ మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందినప్పుడు బాధిత కుటుంబానికి పాలసీ డబ్బులు అందజేస్తామని చెప్పారు. భద్రతలేని రంగాల్లోని కార్మికులకు పాలసీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. పోస్టల్ మేనేజర్ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టాటా బీమా ప్రతినిధి ఆనంద్ పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు

ముండ్లమూరు: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన కార్యక్రమం ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చి నాటి నుంచి బిడ్డ కోసం అదనపు ఆహారం తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సీహెచ్‌ఓ వెంకటరావు, హెచ్‌ఈ రాజు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

పొదిలి: దర్శి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్ శనివారం మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఐదు వాహనాలను తనిఖీ చేసి, రూ.30 వేల జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం, మద్యం సేవించి వాహనాలు నడపటం, వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ లేక పోయినా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.